ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి
ఫోన్: 93910 89608

హైదరాబాద్ సంపుటి: 4 | సంచిక: 135 | పేజీలు: 6 | వెల: రూ.3/- | సోమవారం 24 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

### రాజకీయ కోణంలోనే నా అమెరికా పర్యటనకు
# కేంద్రం అనుమతి ఇవ్వలేదు

**సీఎం రేవంత్ ఆరోపణ**

**కేంద్రం అనుమతి నిరాకరించిన నేపథ్యంలో బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నానని వెల్లడి**

**మరికొన్ని గంటల్లో హైదరాబాద్ వస్తున్నా: ముఖ్యమంత్రి**



**హైదరాబాద్, ఆగస్టు 23 (ప్రభాత ఉదయం)**

రాజకీయ కోణంలోనే తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేంద్రం అనుమతి నిరాకరించిన నేపథ్యంలో బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నానని చెప్పారు. లండన్‌లో తాము చేపట్టిన పర్యటన అత్యంత విజయవంతమైందన్నారు. అక్కడ నిర్వహించిన అన్ని అధికారిక సమావేశాలు, షెడ్యూల్ చేసిన కార్యక్రమాలు పూర్తయ్యాయని రేవంత్‌రెడ్డి సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన అంశంలో ఊహించని పరిణామం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ముందుగా ఖరారైన షెడ్యూల్ ప్రకారం లండన్ పర్యటన ముగించుకొని, ముఖ్యమంత్రి అక్కడి నుంచి నేరుగా అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లాల్సి ఉంది. అయితే, కేంద్ర విదేశాంగ శాఖ ఆయన పర్యటనకు రాజకీయ అనుమతి నిరాకరించింది. విదేశాంగ శాఖ నిర్ణయంతో పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకున్న ముఖ్యమంత్రి, అమెరికా వెళ్లకుండానే లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతున్నారు. ఈ మేరకు లండన్ నుంచే సీఎం రేవంత్ ఒక ప్రకటనను విడుదల చేశారు.

ఖర్గేకు కృతజ్ఞతలు తెలిపిన సీఎం : గత మూడు రోజులుగా లండన్‌లో తమకు లభించిన అపూర్వ మద్దతుకు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు అని సీఎం తన ట్వీట్‌లో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ జాతీయ నాయకత్వం తీవ్రంగా ఖండించిందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ వ్యవహారంపై స్పందిస్తూ, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం ప్రవర్తిస్తోందని, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను ఇలా అడ్డుకోవడం దారుణమంటూ తనకు మద్దతుగా నిలిచారన్నారు. తనకు కొండంత అండగా నిలిచిన పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్ వచ్చాక అన్ని విషయాలపై మాట్లాడతా : అంతేకాకుండా, ఈ విషయంలో జాతీయ ప్రయోజనాలను ..మిగతా 2లో



### పార్టీ లైన్ దాటితే
# చర్యలు తప్పవు

**కొండా సురేఖపై కుట్రలు చేయాల్సిన అవసరం ఎవరికీ లేదు : టిపిసిసి**

**హైదరాబాద్, ఆగస్టు 23 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ నేతలు ఎవరైనా పార్టీ నియమాలు దాటితే కఠిన చర్యలు తప్పవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఏమైనా సమస్యలుంటే పార్టీలో అంతర్గతంగా చెప్పుకోవాలని, దీనికోసం వివిధ కమిటీలు ఉన్నాయని చెప్పారు. అవసరమైతే దిల్లీ వెళ్లి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు చెప్పుకోవచ్చన్నారు. అంతేకానీ పార్టీ లైన్ దాటి బహిరంగ విమర్శలు చేయొద్దని హితవు పలికారు. ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ పరిశీలన తర్వాత మంత్రి కొండా సురేఖపై చర్యలు ఉంటాయని మహేశ్‌గౌడ్ తెలిపారు. బీఆర్ఎస్, భాజపాలా తమది నియంతృత్వ పార్టీ కాదన్నారు. మాట్లాడటానికి పార్టీలో ప్రజాస్వామ్య స్వేచ్ఛ ఉంటుందని, కానీ ..మిగతా 2లో

### అంతరిక్ష రంగంలో కెరీర్‌ను నిర్మించాలకునే వారు
# భారత్‌కు రావాలి

**ప్రధాని మోదీ పిలుపు**

**నేషనల్ స్పేస్ డే సందర్భంగా స్పేస్ స్టార్టప్ సీఈఓలతో ప్రధాని భేటీ**

2లో..



# మళ్లీ దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం!



**కేంద్రం హామీలపై సీజేపీ కీలక భేటీ-**

**కేంద్రం ఇచ్చిన హామీల అమలుపై సోమవారం సీజేపీ సమీక్ష**

**ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ, పరిహారం అంశాల్లో పురోగతి లేదని ఆరోపణ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ప్రభాత ఉదయం)**

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై అసంతృప్తి వ్యక్తం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)మరోసారి ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధమవుతోంది. జులై 25న దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనను విరమించినప్పటికీ, కేంద్రం నుంచి హామీల అమలుపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని పార్టీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో సోమవారం జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించింది. జులై 25న ఆందోళన విరమించే సమయంలో కేంద్రం తమకు పలు హామీలు ఇచ్చిందని సీజేపీ తెలిపింది. వాటి అమలు విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అధికారికంగా తమకు తెలియజేయలేదని పేర్కొంది. ప్రభుత్వం ఇచ్చిన మాటను నమ్మి ఉద్యమాన్ని విరమించామని, తమ విశ్వాసాన్ని బలహీనతగా ..మిగతా 2లో

### యుద్ధం వేళ ఎన్నికల నిర్వహణ
# ప్రమాదకరం

2లో..

**దేశాన్నే విచ్ఛినం చేస్తుంది: జెలెన్‌స్కీ**

**రష్యాతో యుద్ధం వేళ ఉక్రెయిన్‌లో రాజకీయ కలకలం**

**దేశంలో ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపాదించిన రక్షణ శాఖ మాజీ మంత్రి ఫెదోరోవ్**

**అలా చేస్తే దేశం విచ్ఛన్నం అవుతుందని జెలెన్‌స్కీ కీలక వ్యాఖ్యలు**



### ఆడితే చిరిగిపోతాయి,
# ఉతికితే వెలిసిపోతాయి

**విద్యార్థులకు నాసిరకం యూనిఫారాలా? : హరీశ్ రావు**

**ప్రభుత్వ బడుల విద్యార్థులకు యూనిఫారాల తిప్పలు**

**పెద్దవాళ్లకు చిన్నవి, చిన్నవాళ్లకు పెద్దవి**

**మఫత్‌లాల్ ముద్దు, చేనేత వద్దు అన్నదే ప్రభుత్వ వైఖరిగా మారిందా? ... మాజీ మంత్రి హరీశ్ రావు**

**హైదరాబాద్, ఆగస్టు 23 (ప్రభాత ఉదయం)**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాసిరకం యూనిఫారాలు అందిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. మాట్లాడితే ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థ అనే సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీసం నాణ్యమైన యూనిఫారాలు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారా? అని ప్రశ్నించారు. కొన్ని చోట్ల యూనిఫారాలు అందలేదని, అందిన చోట కొలతలు సరిగ్గా లేవన్నారు. కుట్లు ఊడిపోతున్నాయని, ఉతికితే రంగులు వెలిసిపోతున్నాయని ఎద్దేవా చేశారు. రెండు జతలు ఇవ్వాల్సి ఉండగా, చాలా చోట్ల ఒక్క జత కూడా పూర్తిగా అందలేదని ఆరోపించారు.

కమీషన్ల కోసమే : రేవంత్ రెడ్డికి గుజరాత్ దళారులపై ఉన్న ప్రేమ, తెలంగాణ చేనేత కార్మికులపై లేదని మండిపడ్డారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేలా స్థానికంగా యూనిఫారాల తయారీకి ప్రాధాన్యత ఇవ్వాల్సింది పోయి, కమీషన్ల కోసం బడా కార్పొరేట్ సంస్థల నుంచి నాసిరకం యూనిఫారాలు తెప్పించి





# బంగ్లాదేశ్‌లో ఘోరం..

**హిందూ టీచర్ ఫ్యామిలీ దారుణ హత్య**

**బంగ్లాదేశ్‌లో రిటైర్డ్ హిందూ టీచర్ కుటుంబం అనుమానాస్పద మృతి**


**న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ప్రభాత ఉదయం)**

బంగ్లాదేశ్ లో దారుణం చోటుచేసుకుంది. విశ్రాంత హిందూ టీచర్ కుటుంబం హత్యకు గురైంది. తన ఇంటిపై డ్రగ్స్ తీసుకుంటుండడాన్ని ప్రశ్నించినందుకు దుండగులు అతన్ని చంపారు. ఈ సంఘటన రంగ్‌పుర్‌లో చోటుచేసుకుంది.పోలీస్ కమిషనర్ మహ్మద్ అబ్దుల్ వివరాలు వెల్లడించారు. గణపతి చక్రవర్తి (65) కొన్నేళ్ల క్రితం ప్రభుత్వ టీచర్‌గా రిటైర్డ్ అయి హోమియోపతి వైద్యాన్ని ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం రంగ్‌పుర్‌లో కొత్త ఇంటిని నిర్మించుకుని భార్య ప్రీతిలత (50), కుమార్తె అగామీ (23), కుమారుడు ప్రియమ్ (12)తో కలిసి ఉంటున్నారు. చక్రవర్తి భార్య ప్రీతిలతకు ఆమె సోదరి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. మిగతా ..మిగతా 2లో

# అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) రాజేంద్రనగర్ మండల సమితి సమావేశం

**రాజేంద్రనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) :**

రాజేంద్రనగర్ మండల ఏ ఐ వై ఎఫ్ మహా సభలు ఆదివారం బుద్వేల్ లోని ఏ ఆర్ దేవరాజు భవన్ లో జరిగాయి . పార్టీ మండల కార్యదర్శి, మాజీ యువజన సంఘం నాయకులు కన్యగారి నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి శివకుమార్ గౌడ్ హాజరైనారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి శివకుమార్. మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమం ఎప్పటినుంచో చెప్పినట్లుగా దేశ అభివృద్ధి అంటే కొద్దిమంది సంపద పెరగడం కాదని, ప్రజలందరికీ సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, లౌకికత, రాజ్యాంగ విలువలు, శాస్త్రీయ దృక్పథం బలపడటమే నిజమైన అభివృద్ధి అని వారు ఉద్ఘటించారు. ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన ప్రభుత్వ రంగాన్ని కాపాడడం, ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయడం, విద్య, వైద్యాన్ని హక్కులుగా అమలు చేయడం, రైతు, కార్మిక, యువజన ప్రయోజనాలను కాపాడే ప్రజా విధానాలను అవలంబించడం ప్రతి ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యతన్నారు . ప్రజలు ప్రశ్నిస్తే వారిని అణచివేయడం కాదని , వారి సమస్యలను పరిష్కరించడమే



ప్రజాస్వామ్య పాలన లక్షణం అని వారు అన్నారు. కానీ నేడు దేశంలో అమలవుతున్న ఆర్థిక విధానాలు ప్రజల అవసరాల కంటే కార్పొరేట్ లాభాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు . ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరచడం, శాశ్వత ఉద్యోగాలను తగ్గించి కాంట్రాక్టీకరణను పెంచడం, విద్య, వైద్యాన్ని వ్యాపారంగా మార్చడం, సహజ వనరులను ప్రైవేటు చేతుల్లోకి నెట్టడం వల్ల సామాన్య ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతుండగా, శ్రమించే ప్రజల జీవితం మరింత భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా మహాసభలు ఈనెల 29న మరియు సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో యాదగిరిగుట్ట, యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే ఆల్ఫా తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల్లో ఉపాధి, విద్య, వైద్యం, ప్రజాస్వామ్య హక్కులు, యువజన సమస్యలు, ప్రజా రంగ పరిరక్షణ, సామాజిక న్యాయం వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని వారు తెలిపారు. యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్( ఏ ఐ వై ఎఫ్) నూతన కమిటీ నవీన్ అధ్యక్షుడు గా, ప్రభాకర్ కార్యదర్శి గా, ఆఫీస్ బేరర్స్ లుగా రాహుల్, శ్రీ సాయి గౌడ్, తరుణ్, పవన్ గౌడ్, సాయి రిత్విక్ రెడ్డి, కార్తీక్, నవీన్, సౌరభ్, మహేందర్ లు ఎంపికైనారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జె ఆనంద్ గౌడ్ భారత జాతీయ మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిపిఐ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు కన్నగారి లక్ష్మి సిపిఐ మండల సహాయ కార్యదర్శి జె విజయ్ ఆనంద్ గౌడ్ మండల కార్యాలయం కార్యదర్శి జి సత్యం సిపిఐ మండల శాఖ కార్యదర్శులు జె సదానంద్ గౌడ్ కే వాణి శ్రీరాములు సాబీరు ఏ ఐ టీ యూ సీ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎండి సలీం సయ్యద్ కాజా ఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# రాజకీయ కోణంలోనే నా అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు

**మొదటి పేజీ తరువాయి...**

దృష్టిలో ఉంచుకుని తనకు, తెలంగాణ ప్రభుత్వానికి అండగా నిలిచిన వివిధ రాజకీయ పార్టీల నేతలకు, దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. బోస్టన్ పర్యటన రద్దు కావడంతో కొన్ని గంటల్లోనే లండన్ నుంచి బయలుదేరి హైదరాబాద్ చేరుకోనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. భాగ్యనగరానికి చేరుకున్న వెంటనే విదేశాంగ శాఖ నిర్ణయం, దానికి వెనుక ఉన్న రాజకీయం, పర్యటన వివరాలకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తి సమాచారం వెల్లడిస్తానని రేవంత్ రెడ్డి తెలిపారు. "విదేశీ పర్యటన అంశంలో నాకు మద్దతుగా నిలిచిన ఖర్గేకు కృతజ్ఞతలు. లండన్ పర్యటనను విజయవంతంగా ముగించుకున్నాను. కేంద్రం అనుమతి నిరాకరించిన నేపథ్యంలో బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నాను. రాజకీయ కోణంలోనే నా అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. మరికొన్ని గంటల్లో హైదరాబాద్ వస్తున్నా. హైదరాబాద్‌కు వచ్చాక మిగిలిన అంశాలపై మాట్లాడతాను"– సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్

# పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు

**మొదటి పేజీ తరువాయి...**

ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే మాత్రం చర్యలు ఉంటాయని చెప్పారు. కొండా సురేఖపై కుట్ర చేయాల్సిన అవసరం ఎవరికీ లేదు: మంత్రి వాకిటి శ్రీహరి కొండా సురేఖ కుమార్తె వ్యాఖ్యలతో పార్టీకి నష్టం జరుగుతోందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. "ముందు పార్టీ.. ఆ తర్వాతే వ్యక్తులు. పార్టీని కాపాడే బాధ్యత అందరిపై ఉంది. ఎవరైనా లైన్ దాటి మాట్లాడితే ఎఐ చర్యలు తప్పవు. పార్టీ అంతర్గత వ్యవహారాలు ప్రతిపక్షాలకు ఆయుధంగా మారుతున్నాయి. కొండా సురేఖపై కుట్ర చేయాల్సిన అవసరం ఎవరికీ లేదు. చిన్నారెడ్డికి కూడా నోటీసు ఇచ్చారు. సురేఖపై ఏ నిర్ణయమైనా పార్టీ తీసుకుంటుంది" అని వాకిటి శ్రీహరి అన్నారు.

# బంగ్లాదేశ్‌లో ఘోరం..

**మొదటి పేజీ తరువాయి...**

కుటుంబ సభ్యుల ఫోన్లు సైతం కలవకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు శనివారం రాత్రి తాళం వేసి ఉన్న ఆ ఇంటి తలుపులను పగలగొట్టి చూడగా నలుగురు హత్యకు గురై కనిపించారు. చక్రవర్తి మృతదేహం ఇంటి పైకప్పుపైన, భార్య, కుమార్తె మృతదేహాలు మెట్లపైన, కుమారుడి మృతదేహం ఇంట్లోని మంచం కింద లభ్యమయయాయి.

గురువారం రాత్రి ఈ హత్యలు జరిగినట్లు పోలీస్ కమిషనర్ మహ్మద్ అబ్దుల్ తెలిపారు. ఇద్దరు దుండగులు డ్రగ్స్ తీసుకోవడానికి చక్రవర్తి ఇంటిపైకి వెళ్లారు. దాన్ని గమనించిన గణపతి వారిని ప్రశ్నించడంతో తమను గుర్తుపట్టారని, టవల్‌తో మెడకు చుట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. ఈ క్రమంలో శబ్దం రావడంతో భార్య ప్రీతిలత పైకి వెళ్లగా ఆమెను సైతం గొంతునులిమి హత్య చేశారు. అనంతరం వారి పిల్లలను చంపారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానితులను గుర్తించి విచారిస్తున్నట్లు తెలిపారు

# మళ్లీ దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం!

**మొదటి పేజీ తరువాయి...**

భావించొద్దని సీజేపీ హెచ్చరించింది. హామీల అమలుకు అవసరమైన అన్ని చర్యలను పరిశీలిస్తామని, అందులో మరోసారి శాంతియుత మరోసారి శాంతియుత దేశవ్యాప్త ఆందోళన చేపట్టే అవకాశమూ ఉందని స్పష్టం చేసింది. కేంద్రం ఇచ్చిన హామీలను ఆలస్యం చేయడం, వేరే అర్థం చెప్పడం లేదా విస్మరించడం వంటి చర్యలను సహించబోమని హెచ్చరించింది. అలా జరిగితే దేశ యువతకు చేసిన వాగ్దానానికి ద్రోహంగా భావిస్తామని స్పష్టం చేసింది.

**ఎఫ్ఐఆర్‌లపై సుప్రీంకోర్టులో విచారణ**

ఇటీవల ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం కూడా కీలకంగా మారింది. ఆగస్టు 18న దేశవ్యాప్తంగా విద్యార్థులు, ఆందోళనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల సమగ్ర జాబితాను సమర్పించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరినట్లు సీజేపీ తెలిపింది. తమ ప్రకారం, సుప్రీంకోర్టు ఈ జాబితాను మూడుసార్లు కోరిందని, కేసులను కొట్టివేసేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అధికారాలను వినియోగించే అంశాన్ని పరిశీలించేందుకు ఈ వివరాలు అవసరమని తెలిపింది.

# అంతరిక్ష రంగంలో కెరీర్‌ను నిర్మించాలనుకునే వారు భారత్‌కు రావాలి

**మొదటి పేజీ తరువాయి...**

అంతరిక్ష రంగంలో కెరీర్‌ను నిర్మించాలనుకునే వారు భారత్‌కు రావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇందుకోసం తమ ప్రభుత్వం విధారనపరమైన మద్దతిస్తుందని తెలిపారు. నేషనల్ స్పేస్ డే సందర్భంగా స్పేస్ స్టార్టప్ సీఈఓలు ప్రధానితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాము చేపట్టనున్న ప్రాజెక్టుల వివరాలను పలువురు సీఈఓలు మోదీకి వివరించారు. అనంతరం మాట్లాడిన ప్రధాని మోదీ, అంతరిక్ష రంగంలోకి ప్రవేశించి ఎంతో ధైర్యాన్ని ప్రదర్శించారని స్పేస్‌స్టార్టప్ సీఈఓలను ప్రశంసించారు. స్పేస్ టెక్నాలజీతో ప్రజా సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని వారికి సూచించారు.

ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష రంగంలో ఉన్న ప్రతిభావంతులను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మోదీ వెల్లడించారు. అంతరిక్ష రంగంలో పనిచేస్తున్న 20 స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులతో ప్రధాని మోదీ ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్తు అవకాశాలు, సాంకేతికత వినియోగంపై చర్చలు జరిపారు. ఈ భేటీకి సంబంధించిన వీడియోను మోదీ తమ ఎక్స్ పోస్టులో పంచుకున్నారు. ఎప్పటిలాగే, భారత్ అంతరిక్ష ప్రయాణంపై స్టార్టప్‌ల అభిప్రాయాలు, ఆశావహ దృక్పథం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని ప్రధాని పేర్కొన్నారు.

**భరోసా కల్పించడమే మా లక్ష్యం**

అంతరిక్ష రంగం వంటి కొత్త విభాగంలో అడుగుపెట్టిన స్టార్టప్ వ్యవస్థాపకులను మోదీ అభినందనలు తెలిపారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో స్థిరత్వం ఎంతో ముఖ్యమని, దీనివల్ల రిస్క్ తీసుకునే వ్యాపారవేత్తలకు పూర్తి భరోసా లభిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. తమ తప్పిదాల వల్ల ఏదైనా సమస్య వస్తే అది వేరే విషయమని, కానీ ప్రభుత్వ విధానాల మార్పులతో మధ్యలో వదిలివేయరనే నమ్మకం ఉండాలని తెలిపారు. రిస్క్ తీసుకునే వారికి భరోసా కల్పించే వాతావరణాన్ని సృష్టించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

**రిస్క్ తీసుకుంటేనే మనకంటూ ఓ ప్రత్యేకమైన స్థానం**

మరోవైపు, అంతరిక్ష రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులను భారత్ ఆకర్షించగలదని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ రంగంలో భవిష్యత్తును నిర్మించుకోవాలనుకునే ప్రపంచ నిపుణులు భారత్‌కు వచ్చేలా ఒక ప్రత్యేకమైన వాతావరణాన్ని సృష్టించాలని చెప్పారు. రిస్క్ తీసుకుంటేనే మనకంటూ ఓ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకోగలమని అభిప్రాయపడ్డారు. నైపుణ్యం విషయంలో భారత్‌కు ఎలాంటి కొరత లేదని, ఖర్చుల పరంగా కూడా భారత్ పోటీదారుగా ఉందని అన్నారు.

**'ప్రజల జీవితాలను ఎలా సులభతరం చేయవచ్చో ఆలోచించాలి'**

ప్రజల జీవితాలను మెరుగుపరచడంలో స్టార్టప్‌లకు మోదీ పలు కీలక సూచనలు చేశారు. అంతరిక్ష సంస్థలు కేవలం ఉపగ్రహాలు, ప్రయోగాలకే పరిమితం కాకుండా తమ సాంకేతికతతో ప్రజల జీవితాలను ఎలా సులభతరం చేయవచ్చో ఆలోచించాలని అన్నారు. అలాగే, వ్యవసాయ రంగంలో పనిచేసే స్పేస్ టెక్నాలజీ సంస్థలు వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ విభాగాలతో కలిసి పనిచేస్తే రైతులకు మెరుగైన సమాచారం అందించవచ్చని చెప్పారు.



# అమ్మ వారి కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలి:

## ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు ఆగస్టు 23 (ప్రభాత ఉదయం):**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం బీరంగూడ డివిజన్ పరిధిలోని పటేల్ గూడ సిద్ధార్థ కాలనీలో గల శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ దేవాలయం లో ఆదివారం నిర్వహించిన ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అమ్మ వారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన వారిలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, శ్రీకాంత్, ఆలయ కమిటీ సభ్యులు,తదితరులున్నారు

# యుద్ధం వేళ ఎన్నికల నిర్వహణ ప్రమాదకరం

**న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ప్రభాత ఉదయం)**

రష్యాతో యుద్ధం కొనసాగుతున్న తరుణంలో దేశంలో ఎన్నికలు నిర్వహించడం అత్యంత ప్రమాదకరం అని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం మార్షల్ లా (సైనిక చట్టం) అమల్లో ఉన్నందున ఎన్నికల్ని నిలిపివేసినట్లు గుర్తుచేసిన ఆయన, ఈ క్లిష్ట సమయంలో ఓటింగ్ నిర్వహిస్తే దేశం విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇటీవల ఆయన పదవి నుంచి తొలగించిన రక్షణ శాఖ మాజీ మంత్రి మైఖైలో ఫెదోరోవ్ దేశంలో ఎన్నికలు జరపాలంటూ అనూహ్యంగా ప్రతిపాదించిన నేపథ్యంలో జెలెన్‌స్కీ దీనిపై స్పందించారు. శనివారం ప్రత్యేకంగా మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాల్ని వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలు నిర్వహిస్తే దేశంలో రాజకీయ విభజనలు మరింత పెరిగి, ఉక్రెయిన్‌ను మరింత బలహీనపరుస్తాయని అన్నారు. యుద్ధం వేళ ఎన్నికల నిర్వహణతో దేశమే విడిపోయే ప్రమాదం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఆగస్ట్ 22న జర్నలిస్టులతో దాదాపు 2 గంటల పాటు నిర్వహించిన సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు.

యుద్ధం సమయంలో దేశంలో ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్‌కు ప్రజల్లో కూడా పెద్దగా మద్దతు లేదని కొన్ని సర్వేలు చెబుతున్నాయి. తాత్కాలికంగా ఎన్నికలు నిలిపివేస్తూ జెలెన్‌స్కీ తీసుకున్న నిర్ణయానికే ఓటేస్తున్నారు. ఒక సర్వే ప్రకారం కేవలం 15 శాతం మంది ప్రజలు మాత్రమే యుద్ధం ముగిసేలోపు ఎన్నికలు నిర్వహించాలని కోరుకుంటున్నారు. అందుకే ఈ సమయంలో ఎన్నికల దిశగా అడుగులు వేయడం అంటే దేశాన్ని నాశనం చేసుకోవడమే అని జెలెన్‌స్కీ హెచ్చరించారు.

**ఫెదోరోవ్ తప్పుడు మార్గంలో వెళ్తున్నారు- జెలెన్‌స్కీ**

ఇక గత నెలలో రక్షణ మంత్రి పదవి నుంచి ఫెదోరోవ్‌ను తొలగించిన తర్వాత దేశంలో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ వివాదంపై జెలెన్‌స్కీ తొలిసారిగా బహిరంగంగా మాట్లాడారు. ఆయను ఎందుకు, ఏ పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి తొలగించాల్సి వచ్చిందో వివరించారు. ఉక్రెయిన్ సైన్యాన్ని ఆధునీకరించడంలో, డ్రోన్ పోరాటాల్ని పెంచడంలో ఫెదోరోవ్ కీలక పాత్ర పోషించినప్పటికీ, ఆయన మిలిటరీ కమాండ్‌తో విభేదించారని తెలిపారు. ఫెదోరోవ్ ప్రభుత్వం నుంచి బయటకు వెళ్లిన తర్వాత చేపట్టిన భారీ నిరసనలు, ఎన్నికల పిలుపులు తప్పుడు మార్గంలో వెళ్తున్నాయని విమర్శించారు. ఆయనకు స్పష్టమైన కార్యచరణ ప్రణాళిక లేదని పేర్కొన్నారు.

**స్టార్‌లింక్ వివాదం**

రష్యా భూభాగంలో తమ దాడులకు స్టార్‌లింక్ సేవలను ఉపయోగించేందుకు స్పేస్ ఎక్స్ అంగీకరించిందని రక్షణ మంత్రిత్వ శాఖ తప్పుడు సమాచారం ఇవ్వడం వల్ల, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తనకు తీవ్ర ఇబ్బందికర పరిస్థితి ఎదురైందని జెలెన్‌స్కీ వెల్లడించారు. ఎలాన్ మస్క్ ఆ వార్తల్ని ఖండించగా, ట్రంప్ ముందు తాను నిందలు పడాల్సి వచ్చిందని తెలిపారు. పదవి నుంచి తొలగించిన తర్వాత ఫెదోరోవ్ ఎన్నికలు జరపాలని డిమాండ్ చేయడం, సైనిక నాయకత్వంపై విమర్శలు చేయడంపైనా జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించే సైన్యానికి గౌరవం ఇవ్వాలని అన్నారు. ఇంకా ఫెదోరోవ్ ప్రభుత్వంలోనే కొనసాగేందుకు తాను నాలుగు వేర్వేరు ప్రతిపాదనలు చేసినప్పటికీ, ఆయన వాటిని తిరస్కరించారని చెప్పారు.

**క్షిపణుల కొరత- రక్షణ బడ్జెట్ సంక్షోభం**

మరోవైపు రష్యా నుంచి బాలిస్టిక్ క్షిపణి దాడులు రోజురోజుకూ తీవ్రమవుతుండగా, వీటిని ఎదుర్కొనేందుకు మిత్ర దేశాల నుంచి తమకు అందే 'ప్యాట్రియాట్' ఎయిర్ డిఫెన్స్ క్షిపణుల సంఖ్య గణనీయంగా తగ్గుతోందని జెలెన్‌స్కీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 2023లో ఉక్రెయిన్‌కు 675 ప్యాట్రియాట్ క్షిపణులు అందగా, 2025లో ఆ సంఖ్య 364 కు తగ్గిందన్నారు. 2026 నాటికి కేవలం 264 క్షిపణులు మాత్రమే అందే అవకాశం ఉందని తెలిపారు. రాబోయే శీతాకాలం తమకు కనీసం మరో 300 క్షిపణులు అవసరమని, వీటిని అమెరికా నుంచి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.

# ఆడితే చిరిగిపోతాయి, ఉతికితే వెలిసిపోతాయి

**మొదటి పేజీ తరువాయి...**

చేనేత వద్దు అన్నదే ప్రభుత్వ వైఖరిగా మారిందా? : చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేలా, స్థానికంగా యూనిఫారాల తయారీకి ప్రాధాన్యత ఇవ్వకుండా కార్పొరేట్ సంస్థలకు టెండర్లు ఇచ్చారని విమర్శించారు. మఫత్‌లాల్ ముద్దు(కాంట్రాక్ట్ సంస్థ) చేనేత వద్దు అన్నదే ప్రభుత్వ వైఖరిగా మారిందా? అని ప్రశ్నించారు. ఒకవైపు చేనేత కార్మికుల ఉపాధికి గండికొట్టి, మరోవైపు విద్యార్థులకు నాసిరకం యూనిఫారాలు అందించారని విమర్శించారు. దీంతో విద్యార్థులకు కష్టం, చేనేత కార్మికులకు ఉపాధి నష్టమని, నాసిరకం యూనిఫారాలపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

రెండు జతల యూనిఫారాలు : తెలంగాణలోని 28వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు, విద్యాశాఖ గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, సంక్షేమ గురుకులాల్లో సుమారు దాదాపుగా 27 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఏడాదికి రెండు జతల చొప్పున యూనిఫారాలను ప్రభుత్వం అందించాలి. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. బ్రాండెడ్ దుస్తులు (యూనిఫారాలు) అందించేందుకు రూ.678 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపింది. ప్రతీ విద్యార్థికి ఏడాదికి రెండు జతల యూనిఫారాలు, బెడ్‌షీట్లు, దుప్పట్లు, ఇవ్వాలంటే 2.97 కోట్ల మీటర్ల క్లాత్ అవసరం. గతంలో ఈ వస్త్రాన్ని స్థానిక చేనేత కార్మికుల సహకార సంఘం నుంచి కొనుగోలు చేసి పంపిణీ చేసేది. కానీ ఈసారి ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు టెండర్లు అప్పగించింది.

చర్యలు తీసుకుంటారా? : సహకార సంఘానికి మాత్రం 30 శాతం కొనుగోలుకు మాత్రమే ఆర్డర్లను కేటాయించింది. దీనికి తోడు అడ్వాన్స్ చెల్లింపులోనూ జాప్యం జరిగినట్టు సదరు కాంట్రాక్టు సంస్థలు చెబుతున్నాయి. సహకార సంఘాలకు ముందస్తుగా డబ్బులు చెల్లించకపోయినా నాణ్యమైన యూనిఫారాలు ఇచ్చేవి. కానీ కార్పొరట్టట్ సంస్థలు సరాఫరా చేసిన యూనిఫారాలపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. మరి ఇప్పుడైన ప్రభుత్వ చేనేత సంఘాలతో యూనిఫారాలు తయారు చేయించి, సదరు కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకుంటుందా అనే దానిపై వేచి చూడాల్సిందే. ఈ యూనిఫారాల విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ గతంలో పెద్ద ఎత్తున ఆందోళన చేసింది. మంత్రులకు సవాళ్లు విసిరింది. అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్ వద్ద ఆరోజు హైడ్రామా నడిచిన సంగతి తెలిసిందే.

# ప్రభుత్వ విద్యారంగానికి మహర్దశ

**100 కోట్ల రూపాయలతో రెండు నూతన పాఠశాలలు, భవనాల ఆధునీకరణ, అదనపు తరగతి గదులు**

**ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్య:పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి.**

**పటాన్ చెరు, ఆగస్టు 23 (ప్రభాత ఉదయం):**

అమీన్ పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ, అమీన్ పూర్ డివిజన్లలో గల పేద మధ్యతరగతి విద్యార్థులకు అతి త్వరలో అత్యధిక వసతులతో కూడిన క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలలు అందుబాటులోకి రానున్నాయని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.100 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో అమీన్పూర్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం, నవ్య రోడ్డులో నూతన పాఠశాలలకు, కిష్టారెడ్డిపేటలో ఉన్నత పాఠశాల నవీనీకరణ పనులకు ఆదివారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉచితంగా కార్పోరేట్ స్థాయి విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం క్యూర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ఆధునిక వసతులతో క్యూర్ అర్బన్ స్కూల్స్ నిర్మిస్తోందని తెలిపారు. వీటి నిర్మాణం ద్వారా ఒకే ప్రాంగణంలో ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించిన సాధ్యమవుతుందని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఆటస్థలాలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు,



అత్యాధునిక ల్యాబ్‌లు, లైబ్రరీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అతి త్వరలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నూతన పాఠశాలలు ఎంతగానో ఉపకరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్దేశిత గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ సర్పంచ్ కృష్ణ, టిజిడబ్ల్యుసి ఈఈ శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి సుధాకర్, సీనియర్ నాయకులు గోపాల్, కృష్ణ, జగదీష్, సునీత, శ్రీనివాస్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీని క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బలోపేతం చేయాలి

### కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ కార్యదర్శి , రంగారెడ్డి జిల్లా పరిశీలకులు పి.వి. మోహన్


### ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేర్చేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలి

### డీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపికకు సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం

**రాజేంద్రనగర్, ఆగస్టు 23(ప్రభాత ఉదయం)**



సమావేశంలో ప్రసంగిస్తున్న కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ కార్యదర్శి , రంగారెడ్డి జిల్లా పరిశీలకులు పి.వి. మోహన్



కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ కార్యదర్శి , రంగారెడ్డి జిల్లా పరిశీలకులు పి.వి. మోహన్ సన్మానిస్తున్న కాటేదాన్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధనుంజయ్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తీసుకెళ్తూ, పార్టీని క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బలోపేతం చేయాలి:కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ కార్యదర్శి , రంగారెడ్డి జిల్లా పరిశీలకులు పి.వి. మోహన్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్ మండలం తొండుపల్లి గ్రామంలోని మనస్వి గార్డెన్స్‌లో రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సంస్థాగత సంప్రదింపుల సమావేశం నిర్వహించారు.రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా, ఏఐసీసీ సూచనల మేరకు సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ కార్యదర్శి , రంగారెడ్డి జిల్లా పరిశీలకులు పి.వి. మోహన్ తెలిపారు..ఈ సందర్భంగా పి.వి. మోహన్ మాట్లాడుతూ...ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ఆలోచనలు, మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, అందరినీ కలుపుకుని ముందుకు సాగడమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలని పేర్కొన్నారు.సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేసి, ప్రజలకు చేరువైన బలమైన సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యమని పి.వి. మోహన్ తెలిపారు. డీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపికలో క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు పూర్తి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపించే, అందరినీ కలుపుకుని పనిచేసే నాయకత్వాన్ని పారదర్శకమైన విధానంలో ఎంపిక చేస్తామని అన్నారు.

ఈ సమావేశంలో టీపీసీసీ అబ్జర్వర్లు, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సత్తుపల్లి శాసనసభ్యులు డా. మట్టా రాగమయి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.డీసీసీ అధ్యక్ష పదవి కోసం పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్ ధనుంజయ జి శేఖర్ యాదవ్ ,కృష్ణారెడ్డి, సంజయ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జల్లపల్లి నరేందర్ మైలారం సులోచన డివిజన్ అధ్యక్షులు దూడల వెంకటేష్ గౌడ్ ,సామ ఇంద్రపాల్ రెడ్డి ,సి మహేందర్ ముదిరాజ్, బొబ్బిలి శేఖర్ ముదిరాజ్, ప్రేమ్ గౌడ్ ,పి శ్రీధర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మహమ్మద్ గౌస్ ,మహమ్మద్ షౌకత్, నరేందర్, మెరుగు జితేందర్, దుర్గేష్ యాదవ్, కోటేష్ గౌడ్, రవి నాయక్, రాము నాయక్ ,మహమ్మద్ ఖలీల్ ,చందు సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలు, పార్టీ అభివృద్ధికి సంబంధించిన సూచనలు తెలియజేశారు.రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలకు నిప్పు

### ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధం

**బుద్వేల్, ఆగస్టు 23 (ప్రభాత ఉదయం) :**



ఇంటి బయట పార్క్ చేసిన ద్విచక్ర వాహనానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారుతీనగర్‌లో కలకలం రేపింది. జుపిటర్ పక్కనే పార్క్ చేసి ఉన్న మరో ద్విచక్ర వాహనం పైన్‌కు కూడా మంటలు వ్యాపించడంతో కొంతమేర దెబ్బతింది.ఘటనతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. వాహనాలకు నిప్పుపెట్టిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఘటనకు గల కారణాలపై కూడా ఆరా తీస్తున్నారు. అయితే బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు

**బండ్లగూడ, ఆగస్టు 23 (ప్రభాత ఉదయం)**

బండ్లగూడ తులిప్ ఆర్కేడ్ ప్రాంతానికి చెందిన పిట్ల విజయలక్ష్మి రవీందర్ ముదిరాజ్ కుమారుడు దిలీప్ వివాహం బెక్కం జయశ్రీ దేవి, స్వర్గీయ విట్టల్ రాజ్ ల ద్వితీయ పుత్రిక గీతికతో ఆదివారం వేద పండితులను మంత్రోత్సవాల మధ్య ఘనంగా జరిగింది. ఆదివారం కర్మన్ ఘాట్ లోని ఎస్ వై ఆర్ కన్వెన్షన్ హాల్లో ఈ వివాహ వేడుకలకు ఈ కళ్యాణ మహోత్సవానికి బంధుమిత్రులతో పాటు శ్రేయోభిలాషులు వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన రాజేంద్రనగర్ నియోజకవర్గం బి.ఆర్.ఎస్ ఇంచార్జ్ పి కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్, ఆగస్టు23(ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, తో పాటు కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని పలు వివాహ శుభకార్యాలకు హాజరై వధూవరులకు ఆశీర్వదించి శుభకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, రాము యాదవ్ ,అశోక్ కుమార్, చిరంజీవి, సునీల్, అనిల్, నాని ,రాజు, వెంకటేష్, సెంట్రింగ్ అశోక్ ,సంతోష్ రిషి లు శుభాకాంక్షలు తెలియజేశారు.



# మున్సిపల్ కార్మికులపై దాడి చేసిన వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి

### తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి

**రాజేంద్రనగర్, ఆగస్టు23(ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ సర్కిల్ పరిధిలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలి పురంలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై దాడి జరిగిన సమాచారం తెలిసిన వెంటనే మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ కు తెలంగాణ మున్సిపల్ స్టాఫ్, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి పోలీస్ స్టేషన్ లో ఉన్న వర్కర్లను పరామర్శించి సమాచారం తెలుసుకోవడం జరిగింది. పోలీస్ స్టేషన్ లో దాడి చేసిన వ్యక్తి పై కార్మికులు కే.కృష్ణ, వి.అలువేలమ్మ, సి.వెంకటమ్మ, ఆర్.యాదమ్మ ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఉదయం లేచి ప్రజల ఆరోగ్యాల కోసం విధులు నిర్వహిస్తున్న కార్మికులపై దాడి చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఇలాంటి దాడులు కార్మికులపై చేసే కార్మికులు ఏ విధంగా విధులు నిర్వహిస్తారని మండిపడ్డారు.పారిశుధ్య పనులు ఏదైనా చేయించుకోవాలంటే కార్మికులను దాడి చేయించుకోవడం కాదు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చెయ్యాలి. బస్తీలలో విధులు నిర్వహిస్తున్న సమయంలో తాగి పారిశుధ్య కార్మికుల పై దాడి చేస్తున్న వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సిఐ ని కోరారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్ జి.జాషువా, జె.మహేందర్, కే.సంగీత, వి.రాజు, కార్మికులు సబిత, రాములమ్మ, ఉషారాణి, జె.యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.




# విభిన్న సంస్కృతులకు నిలయం పటాన్ చెరు: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### ఆర్ సి పురంలో ఘనంగా ఓనం వేడుకలు

**పటాన్ చెరు, ఆగస్టు 23 (ప్రభాత ఉదయం)**



విభిన్న సంస్కృతులకు నిలయం పటాన్ చెరు నియోజకవర్గమని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని ఎస్ ఎన్ గార్డెన్స్ లో కేరళ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓనం వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ ఇండియా గా పేరుందిన పటాన్ చెరు నియోజకవర్గంలోని అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమానికి పాటుపడుతున్నామని తెలిపారు. కుల మతాలకు అతీతంగా అందరి పండుగలను సంప్రదాయాలను గౌరవిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు అంజయ్య, మెట్టు కుమార్ యాదవ్, పరమేష్ యాదవ్, విశాల్, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏ ఐ ఎస్ ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామిడి వంశీ వర్ధన్ రెడ్డి

# విద్యార్థుల హక్కుల కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాడుతుంది

### ఏఐఎస్ఎఫ్ రాజేంద్రనగర్ మండల 10వ మహాసభ....విద్యా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలి.. సామిడి వంశీ వర్ధన్ రెడ్డి

**బుద్వేల్ , ఆగస్టు 23 (ప్రభాత ఉదయం) :**

విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఏఐఎస్ఎఫ్‌కు దేశవ్యాప్తంగా గొప్ప పోరాట చరిత్ర ఉందని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాజేంద్రనగర్ మండల 10వ మహాసభను ఆదివారం రాజేంద్రనగర్ సీపీఐ పార్టీ కార్యాలయం ఏఆర్ దేవరాజ్ భవన్ లో పార్టీ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. అనంతరం సామిడి వంశీ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, విద్యా రంగ పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిన ఘనత ఏఐఎస్ఎఫ్‌కు ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాల వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రభుత్వాలు విద్యా రంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. విద్యార్థులపై పెరుగుతున్న ఫీజుల భారం, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు, నాణ్యమైన విద్యను ప్రతి విద్యార్థికి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలను ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకోకుండా, విద్యార్థి సంఘాలతో చర్చించి విధానాలను రూపొందించాలని అన్నారు.రానున్న రోజుల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మరింత విస్తృతమైన ఉద్యమాలు చేపడతామని, విద్యా వ్యతిరేక విధానాలను ఎక్కడికక్కడ ప్రతిఘటిస్తామని సామిడి వంశీ వర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆనంద్ గౌడ్, కన్నగారి లక్ష్మి, విజయ్ ఆనంద్ గౌడ్,, జి సత్యం సదానంద్ గౌడ్, వాణి, శ్రీరాములు, సాబీరు, సలీం, సయ్యద్ ఖాజా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ..**

రాజేంద్రనగర్ మండల ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా డి. శివ సాయి రామ్, అధ్యక్షురాలిగా కె. ప్రత్యూష, సహాయ కార్యదర్శులుగా సాయి తేజ, డి. లక్ష్మీనారాయణ దత్తు, ఉపాధ్యక్షులుగా రుత్విక్, ఎం. సాయి తేజ రావు, జి. నరోత్తం, సంయుక్త కార్యదర్శిగా డి. ప్రవీణ్ కుమార్ తో పాటు మరికొంత మందిని నూతన మండల కౌన్సిల్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# సభ్యుల ఆర్థిక చేయుతకు మరింత కృషి

### సత్యసాయి పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం లిమిటెడ్ అధ్యక్షుడు పగిడిమర్రి సూర్యనారాయణ

### వ్యవస్థాపక సలహారుడు గద్దె యాదగిరి ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ రూ.2 లక్షలు, గరిష్ట రుణ పరిమితి రూ.5 లక్షలకు ప్రతిపాధనకు 26వ వార్షిక సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆమోదం.

**రాజేంద్రనగర్, ఆగస్టు 23(ప్రభాత ఉదయం)**



సభ్యులకు మరింత ఆర్థిక చేయుతనందించడానికి నిబంధనల మేరకు కృషి చేయనున్నట్లు సత్యసాయి పరర్పర సహాయక సహకార పొదుపు సంఘం లిమిటెడ్ అధ్యక్షుడు పగిడిమర్రి సూర్యనారాయణ తెలిపారు.మొండి బకాయిదారు నుంచి రుణాల వసూళ్ళకు న్యాయ సహాదారుడి నియమకాన్ని చేపట్టాలని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం శుభ పరిణామంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆదివారం మార్కండేయనగర్ కాలనీలోని సత్యసాయి పరర్పర సహాయక సహకార పొదుపు సంఘం లిమిటెడ్ 26వ వార్షిక సర్వసభ్య సమావేశం సంఘ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సభలో వార్షిక నివేధిక ప్రవేశపెట్టి , ఆ కాపీలను సభ్యులకు అందజేశారు. అనంతరం వార్షిక నివేధిక చదివి వినిపించి, సభ్యుల నుంచి వచ్చిన అభ్యతరాలు, అనుమానాలను నివృత్తం చేశారు. దాంతో మహా సభలో సభ్యులు గడిచిన ఆర్థిక సంవత్సరం సంఘం నిర్వాహణ లావాదేవిలు, ఆదాయ, వ్యయాల ఆడిట్ రిపోర్టులకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతనం అధ్యక్షుడు పగిడిమర్రి సూర్య నారాయణ మాట్లాడుతూ... 20 మంది సభ్యలతో ప్రారభమై సత్యసాయి పొదుపు సంఘం ప్రస్తుతం 670 మంది పొదుపు సభ్యులకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 1వ తేదీ 2025 నాటికి రూ.5 కోట్ల 13 లక్షల92 వేల 260 రూపాయల ప్రారంభ నిల్వలావాదేవిలతో ప్రారంభమైన సంఘ నిర్వాహణ ఈ ఏడాది మరో రూ.55.86 లక్షల ఆర్థిక వృద్ధి సాధించి రూ.5 కోట్ల 69 లక్షల,78 వేల 772 రూపాయల టర్నోవర్‌ను 31 మార్చి 2026 నాటికి సాధించినట్లు పేర్కొన్నారు. అంతకు ముందు వ్యవస్థాపక సలహారుడు గద్దె యాదగిరి సభ దృష్టికి తీసుకువచ్చిన రూ.5 లక్షల సరళీకృత చెల్లింపుల(ఎల్ఆర్ఎస్) పథకం, రుణ మంజూరీ రూ.5 లక్షల గరిష్ట పరిమితి ప్రతిపాధనల పై సభలో సుదీర్ఘంగా చర్చ కొనసాగింది. అనంతరం గరిష్ట రుణ పరిమితి రూ.5 లక్షలకు పరిమితం చేయడంతో పాటు ఎల్ఆర్ఎస్ ప్రస్తుతం ఉన్న లక్ష రూపాయల పరిమితిని రూ.2 లక్షలకు పెంచుతూ ప్రవేశపెట్టిన ప్రతిపాధనను సభ్యులు ఆమోదించారు. మొండి బకాయిదారులు సంఘానికి చెల్లించాల్సిన రుణాల మొత్తం జాబితా వార్షిక నివేధికలో ఆ పూర్తి వివరాలతో సభ్యులకు తెలిసేలా ముద్రించాలన్న ప్రతిపాధనను సభ్యులు ఆమోదించారు. అలాగే ముఖ్య సలహాదారులు ఏర్వ సత్యనారాయణ, గద్దె క్రిష్ట పదవీ విరమణ చేసే సభ్యులకు వారు రుణం పొందినప్పుడు చెల్లించిన ఎల్ఆర్ఎస్ మొత్తాన్ని ఏలాంటి క్లేమ్ లేని సభ్యులకు తిరిగి చెల్లించాలనే ప్రతిపాదనను కూడా సభ్యులు ఆమోదిస్తూ పదవీ విరమణ పొందే సభ్యులకు సంఘం గ్రాంట్‌గా రూ.1116 అందజేయాలని తీర్మాణించారు. అలాగే గతంలో తీర్మాణించిన మేర చేపట్టనున్న సత్య సాయి కళ్యాణ మండపం నిర్మాణ వ్యయం ఎంత, ఆ పనులకు కొటేషన్‌లు పిలిచారా..? అన్న సభ్యుడు యాదగిరి భాస్కర్ ప్రశ్నను స్వాగతించిన పాలక వర్గం దేవాలయం వద్ద రిటర్నింగ్ వాల్ నిర్మాణం కోసం చేస్తున్న ప్రయాత్నాలు ప్రణాళిక రూపం దాల్చాయని, టెండర్ అనంతరం ఆ పనులు పూర్తి అయిన తరువాత నిర్మాణ పనులు ప్రారంభించే ముందు అయ్యే ఖర్చుల పై పాలక వర్గం చర్చించి,కళ్యాణ మండప నిర్మాణ కాంట్రాక్టర్ ఎంపిక ప్రక్రియ చేయనున్నట్లు పాలకవర్గం వెల్లడించింది. వేదవ్యాస్ అండ్ అసోసియేట్స్, చార్టర్డ్ అకౌంటెంట్స్ నివేధికను ఆడిటర్ వెంకటేష్ సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మునగపాటి విష్ణు, ప్రధాన కార్యదర్శ కోట శ్యామ్ కుమార్, సంయుక్త కార్యదర్శ శిరందాసు నరేందర్, కోశాధికారి కోట పవన్ కుమార్ పాకవర్గం సభ్యులు కైరంకొండ, కర్నాటి శ్రీనివాస్, గంజి ధనంజయ్, బాత్కు విజయ్ కుమార్, బోనకుర్తిరాము, పూల పద్మమ్మ, గంజి నాగమణి, సంఘం అకౌంటెంట్ శ్రీరామ్ రాజుద తోపాటు పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

# అంజయ్య నగర్ డివిజన్‌లో విరుచుకుపడుతున్న 'బిల్డర్ మాఫియా'

## మాజీ ప్రజాప్రతినిధి అభయహస్తం.. అధికారుల అండతో అడ్డం లేని అక్రమాలు!

**శేరిలింగంపల్లి :ఆగష్టు 23, (ప్రభాత ఉదయం)**

ఐటీ కారిడార్ గుండెకాయ లాంటి మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అంజయ్య నగర్ డివిజన్ అక్రమ నిర్మాణాలకు, భూకబ్జాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, రాజకీయ పలుకుబడిని అడ్డం పెట్టుకుని ఒక వర్గానికి చెందిన సుమారు 30 మంది గ్యాంగ్‌గా ఏర్పడి 'బిల్డర్ మాఫియా' అవతారం ఎత్తింది. సర్కిల్ అధికారులు, స్థానిక శానిటేషన్ సిబ్బందిని ఏజెంట్లుగా మార్చుకుని నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలను విచ్చలవిడిగా లేపుతున్నారు. సందు దొరికితే చాలు.. ప్రభుత్వ భూములు, పార్కులు, కోళ్ల ఫారాల స్థలాలను సైతం వదలకుండా నకిలీ పత్రాలతో క్రయవిక్రయాలు సాగిస్తూ కోట్ల రూపాయలు వెనకేసుకుంటున్నారు.

**నయా మాఫియా రాజ్యం సొంతింటి కలపై బెదిరింపుల నీడ**

అంజయ్య నగర్, సిద్దిక్ నగర్, వడ్డెర బస్తీ, పిజిఆర్ నగర్, గుల్షన్ నగర్, బంజారా బస్తీ పరిధిలో సాధారణ పౌరులు ఇల్లు కట్టుకోవడమే పాపమైపోయింది. ఎవరైనా కొత్తగా స్థలం కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకుందామని వస్తే, ఈ మాఫియా ముఠా వాలిపోతుంది. "మాకే పనులు ఇవ్వాలి, లేదంటే ఇక్కడ ఒక్క ఇటుక కూడా పడనివ్వం" అని నిర్దాక్షిణ్యంగా బెదిరింపులకు దిగుతున్నారు. అన్నీ మేమే చూసుకుంటామని ఇంటి యజమానులకు రంగుల కలలు చూపి, లొంగకపోతే భయపెట్టి పనులు లాక్కుంటున్నారు. 100,120, 60 గజాల స్థలానికి మున్సిపల్ నుండి కేవలం 'స్టిల్ట్ ప్లస్ 2' అనుమతి తీసుకుని, ఏడంతస్తులు భారీ భవనాలను అడ్డగోలుగా నిర్మిస్తున్నారు. ఈ మాఫియాన్ని కాదని సొంతంగా ఇల్లు కట్టుకునే అమాయకులకు నానా ఇబ్బందులు సృష్టిస్తూ, నరకం చూపిస్తున్నారు. అటు మాజీ ప్రజాప్రతినిధి వర్గం, ఇటు ఓ సంఘం వర్గం తప్ప సామాన్యుడికి ఇక్కడ రక్షణే లేకుండా పోయింది. గచ్చిబౌలి సర్వే నంబర్ 134,135 136లో అక్రమ సామ్రాజ్యాన్ని ఈ బిల్డర్ మాఫియాలో ప్రధాన సూత్రధారుగా వ్యవహరిస్తున్నారు. బిల్డర్స్ మాఫియా ఘోరాలకు అంతులేకుండా పోతోంది.

**కోళ్ల ఫారం ల్యాండ్ కబ్జా:**

గచ్చిబౌలి సర్వే నంబర్ 136లోని కోళ్ల ఫారం స్థలంతో పాటు అంజయ్య నగర్, బంజారా బస్తీ పరిధిలోని ఖాళీ స్థలాలను నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భవనాలు నిర్మించి విక్రయిస్తున్నట్లు స్థానికులు చెప్తున్నారు. అంజయ్య నగర్ లోని వార్డు ఆఫీసు సమీపంలోని ప్రభుత్వ పార్కు స్థలాన్ని సైతం మాజీ ప్రజాప్రతినిధి అండదండలతో ఆక్రమించి నిర్మాణాలు పూర్తి చేశాడు.

**రెవెన్యూ నిద్ర:**

సర్వే నంబర్ 136లో నూతనంగా కబ్జాలు చేసి అక్రమ నిర్మాణాలు ప్రారంభించినా, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక భారీగా ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నగరానికి చెందిన పలువురు నిర్మాణదారులకు మాజీ ప్రజాప్రతినిధి మద్దతుతో అధికారులను బెదిరిస్తూ బహుళ అంతస్తు భవనాలు నిర్మిస్తున్నారు. ఖాళీ స్థలాలకు నకిలీ పత్రాలు సృష్టించిన సాజిద్ ఖాన్ కోట్ల రూపాయల భూ అక్రమాలకు తెరలేపాడు.





కూలీపోతున్న కోనసాగుతున్న అక్రమ నిర్మాణాలు.. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ.

**మాదాపూర్ సర్కిల్‌లో 'లక్షన్నర' వసూళ్ల దందా.. శానిటేషన్ సిబ్బందే వసూళ్లు!**

ఈ అక్రమ నిర్మాణాల వెనుక మాదాపూర్ సర్కిల్‌లోని ఒక ప్రధాన అధికారి హస్తం పుష్కలంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. భవనం నిర్మించే ప్రతి స్లాబ్‌కు లక్ష నుండి లక్షన్నర రూపాయల వరకు సదరు అధికారి ముడుపులు వసూలు చేస్తున్నట్లు స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. శానిటేషన్ సూపర్వైజర్లే సమాచారకర్తలు: డివిజన్‌లో ఎక్కడెక్కడ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయో సమాచారం సేకరించడం, వసూళ్లు చేయడం టౌన్ ప్లానింగ్ సిబ్బంది కాకుండా శానిటేషన్ విభాగానికి చెందిన సూపర్వైజర్లు చేస్తుండటం విస్తుగొలుపుతోంది. గత ఏడాది సిద్దిక్ నగర్‌లో ఏడంతస్తుల భవనం ఒరిగిపోయిన సమయంలో హైడ్రా, మున్సిపల్ అధికారులు వచ్చి "అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం, మాఫియాపై ఉక్కుపాదం మోపుతాం" అని హడావుడి చేశారు. కానీ, కొందరు స్థానిక నాయకులు ఎన్నికల్లో ఓడిపోయిన నాయకుడిని అడ్డం పెట్టుకుని ఆ భవనాలను కూల్చకుండా కాపాడుకున్నారు. ఆ తర్వాత అధికారులు మళ్లీ అటువైపు తిరగి చూడకపోవడం గమనార్హం.

**ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆగ్రహం.. బలిపశువువైన చిన్న అధికారి!**

అంజయ్య నగర్ డివిజన్‌లో జరుగుతున్న అక్రమాలపై స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి కాలనీలో అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని, రేపటి నుండి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పర్మిషన్ లేని భవనాల పరిశీలించి కూల్చివేస్తామని హెచ్చరించారు. అవగాహన లేని వారు బిల్డర్లుగా మారి ప్రమాదకర నిర్మాణాలు చేస్తున్నారని, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించే అధికారులను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.

భవనం కూలీ పోయిన సంఘటనలో అసలైన నిందితులను వదిలేసి టౌన్ ప్లానింగ్ సెక్షన్ ( టిపిఎస్) సస్పెండ్ చేయడం తీవ్ర విస్మయానికి గురిచేసింది.

అక్రమ నిర్మాణాల వెనుక ప్రధాన అధికారి వసూళ్లు చేస్తుంటే, ఏ సంబంధం లేని కింది స్థాయి అధికారిపై వేటు వేయడంపై తోటి ఉద్యోగులు, ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సస్పెండ్ చేసిన అధికారి ఏదైనా అక్రమ భవనం వద్దకు వెళ్లి నోటీసు ఇస్తే రాజకీయ పలుకుబడి ఉన్నవాళ్లది, నువ్వు ఇటువైపు రాకూడదని సర్కిల్ అధికారి బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**కొనసాగుతున్న శిథిలాల తొలగింపు**

శనివారం మధ్యాహ్నం కూలిపోయిన ఏడు అంతస్తుల భవనం శిథిలాలను హైడ్రా సిబ్బంది బాహుబలి యంత్రంతో తొలగిస్తున్నారు. శిథిలాల తొలగింపు తో పాటు సమీపంలో దెబ్బతిన్న మరో రెండు భాగాలను భవనాలను సైతం హైడ్రాధికారులు కూల్చి వేస్తున్నారు. సోమవారం నుండి హైడ్రా, టౌన్ ప్లానింగ్ పోలీసులు సంయుక్త పర్యవేక్షణలో అంజయ్య నగర్, సిద్దిక్ నగర్ లో నిర్మించిన అక్రమ నిర్మాణం పరిశీలించి కూల్చివేతల కొనసాగిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.

**ఉక్కుపాదం మోపాల్సిందే!**

మాజీ ప్రజాప్రతినిధి అండదండలు, అధికారుల లాలూచీతో అంజయ్య నగర్ డివిజన్ ఒక మాఫియా అడ్డాగా మారింది. స్థానిక ఎమ్మెల్యే హెచ్చరికలు కేవలం పేపర్లకే పరిమితం కాకుండా, హైడ్రా, మున్సిపల్ ఉన్నతాధికారులు రంగంలోకి దిగి సాజిద్ ఖాన్ వంటి కబ్జాదారులపై, 30 మంది బిల్డర్ మాఫియాపై, వారికి సహకరిస్తున్న మాదాపూర్ సర్కిల్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.



సంకూరి జయ ప్రకాష్ ను అభినందిస్తున్న మాజీ కౌన్సిలర్, బీ ఆర్ ఎస్ కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్ వెంకటేష్, నాయకులు యు నిరంజన్ నేత, ఎదిరె శ్రీనివాస్ గుప్తా, ఎస్ అశోక్ తదితరులు



సంకూరి జయ ప్రకాష్ ను సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక మేనేజింగ్ డైరెక్టర్ మేకల దామోదర్ రెడ్డి, సీనియర్ రిపోర్టర్ అప్పారెడ్డి గూడెం భీమయ్య లు



శ్రేష్టం గేట్ వే హోటల్ ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్. చిత్రం లో సంకూరి జయ ప్రకాష్ తదితరులు

# శంషాబాద్‌లో శ్రేష్టం గేట్ వే హోటల్ ప్రారంభం

## రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ చేతుల మీదుగా హోటల్ ను ప్రారంభించుకున్న నిర్వాహకులు

**శంషాబాద్, ఆగస్టు 23 (ప్రభాత ఉదయం)**

శంషాబాద్ లో పద్మశాలి సంఘం నాయకులు, ఇందిరా గాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు సంకూరి జయ ప్రకాష్ నిర్మించిన భవనంలో ఏర్పాటు చేసిన శ్రేష్టం గేట్ వే హోటల్ ను ఆదివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. శంషాబాద్ లో రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఉందని జెడ్ దేశ విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల కు వసతి సౌకర్యం కోసం హోటల్ లు ఎంతగానో ఉపయోగ పడుతాయన్నారు. శ్రేష్టం గేట్ వే హోటల్ లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సౌకర్యాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సంకూరి జయ ప్రకాష్ ను, హోటల్ నిర్వాహకులను అభినందించారు.

**శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు:**

శంషాబాద్ లో అంతర్జాతీయ ప్రమాణాలతో సంకూరి జయ ప్రకాష్ హోటల్ ను నిర్మించడం సంతోష కరమని బీ ఆర్ ఎస్ కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ అన్నారు. సంకూరి జయ ప్రకాష్ మరింత అభివృద్ధి చెందాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక మేనేజింగ్ డైరెక్టర్ మేకల దామోదర్ రెడ్డి, సీనియర్ రిపోర్టర్ లు అప్పారెడ్డి గూడెం భీమయ్య, కోట్ల చంద్రకాంత్ పగిడిమర్రి సూర్య నారాయణ, నాయకులు ఎదిరె శ్రీనివాస్ గుప్తా, ఉస్మేమూరి నిరంజన్ నేత, ఎస్ అశోక్ తో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, స్నేహితులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి: పాలకుల పక్షపాతం..

## అధికారుల ఉదాసీనతతో పౌరుడి ప్రాణం పోయింది!

**గౌతమీనగర్‌లో అసంపూర్తి రోడ్డు పనుల వికృత రూపం**

**ఏడేళ్లుగా తీరని డ్రైనేజీ సమస్య.. హడావుడిగా తవ్వి వదిలేసిన అధికారులు**

**రోడ్డుపై పేర్చిన మెటీరియల్‌పై జారిపడి తీవ్ర గాయాలతో శ్రీనివాసరావు మృతి**

**బాధ్యులైన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని 'జనం కోసం' ఉగ్రరూపం**



గౌతమీ నగర్ కాలనీలో రోడ్డు అడ్డంగా వేసిన కంకర గుట్టలు..



కంకర గుట్ట మీద పడి మృతి చెందిన శ్రీనివాసరావు...

**శేరిలింగంపల్లి : ఆగష్టు 23, (ప్రభాత ఉదయం)**

పాలకుల రాజకీయ కక్షలు, ప్రజాప్రతినిధుల స్వార్థం, అధికారుల కొరవడిన జవాబుదారీతనం ఇవాళ ఒక నిండు ప్రాణాన్ని పొట్టనబెట్టుకున్నాయి. గౌతమీనగర్ కాలనీలో అస్తవ్యస్తంగా తవ్వి వదిలేసిన రోడ్డు పనుల వల్ల కంకర కుప్పలపై జారిపడి శ్రీనివాసరావు (50) అనే పౌరుడు అకాల మరణం చెందడం స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని, ఆగ్రహాన్ని కలిగిస్తోంది.

**రాజకీయ కక్ష సాధింపు.. అసంపూర్తి పనులు!**

చందానగర్ పోలీస్ స్టేషన్ నుంచి బిచ్చారెడ్డి స్వీట్ హౌస్ వరకు 7 రోడ్లతో కూడుకున్న గౌతమీనగర్ కాలనీలో గతంలో ఎలాంటి డ్రైనేజీ సమస్యలు ఉండేవి కావు. కానీ రాజకీయ వివక్షతో కేవలం రెండు రోడ్లను మాత్రమే పూర్తి చేసి, మూడింటిని ఏడేళ్లుగా పెండింగ్‌లో పెట్టడం పాలకుల వైఫల్యానికి నిదర్శనం. ఎన్నికలు సమీపిస్తుండటం, కార్పొరేటర్ల పదవీకాలం ముగుస్తుండటంతో శిలాఫలకాలపై పేర్ల కోసం హడావుడిగా శంకుస్థాపనలు చేసి, తవ్వకాలు చేపట్టి ఆపై పనులను గాలికి వదిలేశారు.

**ప్రమాదకరంగా మారిన మెటీరియల్.. ప్రాణం తీసిన వైఫల్యం**

రోడ్డు వేయడం కోసం కంకర, మెటీరియల్ కుప్పలను వాయిదాల పద్ధతిలో పోసి వదిలేయడం వల్ల, శిల్పా ఎన్క్లేవ్ కాలనీలో నివసిస్తున్న ఒంగోలుకు చెందిన శ్రీనివాసరావు నడుచుకుంటూ వెళ్తుండగా జారిపడి తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు 108లో కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించినప్పటికీ, చికిత్స పొందుతూ ఆయన మరణించారు.

**ఈ మరణానికి బాధ్యులు ఎవరు?**

ఈ ఘోరానికి ఎవరు బాధ్యత వహిస్తారు? సొంత లబ్ధి, కక్ష సాధింపులతో ప్రజారోగ్యాన్ని, మౌలిక వసతులను పక్కనబెట్టిన ప్రజాప్రతినిధులా? ఉదాసీన అధికారులాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నాయకులు చెప్పినట్లే తందానా అంటూ పనుల్లో తాత్సారం చేసిన మున్సిపల్ అధికారులపై చర్య తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చెస్తున్నారు. పనులు చేపట్టి నెలల తరబడి పూర్తి చేయకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కాంట్రాక్టర్ ని బ్లాక్ లీస్టులో పెట్టాలని స్థానికు గట్టిగా వాదిస్తున్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ కేసులు నమోదు చేసి నోటీసులు పంపినా చలనం లేని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, మియాపూర్ డిప్యూటీ కమిషనర్లకు చలనము లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇది ప్రమాదం కాదని ముమ్మాటికి ప్రభుత్వ హత్యే! "జనం కోసం సంస్థ" అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆరోపించారు. తమ కాలనీ సమస్యను ఎన్హెచ్ఆర్సీ దాకా తీసుకెళ్లినా పాలకులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే నని భాస్కరరెడ్డి మండిపడ్డారు. పాలకుల అధికారుల నిర్లక్ష్యం వల్ల ఒక పౌరుడి కుటుంబం వీధిన పడిందని, ఈ పాపం అధికారులను, పాలకులను వదిలిపెట్టదని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే శ్రీనివాసరావు కుటుంబానికి పరిహారం ప్రకటించాలని, బాధ్యులైన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తక్షణమే రోడ్డు పనులను పూర్తి చేయాలని కాలనీవాసులు, 'జనం కోసం' డిమాండ్ చేసింది.





# శ్రీ శ్రీ శ్రీ భీమలింగేశ్వర స్వామి దేవాలయం పునర్నిర్మాణం భూమి పూజ చేసిన గద్వాల ఎమ్మెల్యే దంపతులు

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు23(ప్రభాత ఉదయం)**



గద్వాల జిల్లా కేంద్రంలోని రెవెన్యూ కాలనీ లో శ్రీ శ్రీ శ్రీ భీమలింగేశ్వర స్వామి దేవాలయానికి పునర్నిర్మాణం భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, బండ్ల జ్యోతి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఎమ్మెల్యే దంపతులకు వార్డు కౌన్సిలర్ దేవాలయ కమిటీ సభ్యులు నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు.దేవాలయంలో ఎమ్మెల్యే దంపతులు ఆ పరమశివునికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులను తీసుకున్నారు.శ్రీ శ్రీ శ్రీ భీమలింగేశ్వర స్వామి దేవాలయం పునర్నిర్మాణనికి ఎమ్మెల్యే దంపతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ...గద్వాల పట్టణంలో రెవెన్యూ కాలనీ దేవాలయం ఉండడంవల్ల వార్డ్ నివసించే ప్రజలకు ఎలాంటి ఆకంటాలు లేకుండా ఆ ఆ దేవుని రక్షణలో ఆశీస్సులు ఉండడం వల్ల వార్డ్ ఎలాంటి సమస్యలు లేకుండా ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించడానికి సాధ్యమవుతుందని అని తెలపారు. ప్రతి ఒక్కరూ వార్డ్ కలిసిమెలిసి కలిసికట్టుగా దేవాలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి అదేవిధంగా వార్డ్ అభివృద్ధిలో కూడ ప్రతి ఒక్కరు వార్డ్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్, జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి గడ్డం కృష్ణారెడ్డి, సత్య రెడ్డి,ఆలయ కమిటీ అధ్యక్షుడు బండ్ల రాజశేఖర్ రెడ్డి, పి ఏ సి ఎస్ చైర్మన్ ధర్మారెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, కౌన్సిలర్స్ వేదవతి వెంకటేశ్వర రెడ్డి, రామలింగేశ్వర కాంమ్లే, చంద్రశేఖర్, సర్పంచ్ శివ, మాజీ కౌన్సిలర్ మురళి, నరహరి శ్రీనివాసులు, శీను ముదిరాజ్, నాయకులు ధర్మారెడ్డి, ఆలూరు రామయ్య శెట్టి, ప్రభాకర్ గౌడ్, లక్ష్మన్న, నాగశంకర్, శంకర్, వీరేష్, దేవాలయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా అంబియన్స్ పోర్ట్ కాలనీ వాసులు కావడి యాత్ర

## అంబియన్స్ పోర్ట్ కాలనీ నుంచి చిన్న అనంతగిరి శివాలయం వరకు కొనసాగిన కావడి యాత్ర

## ఉత్తర భారతీయులు శ్రావణమాసం సందర్భంగా ఘనంగా కావడియాత్ర..

**రాజేంద్రనగర్,ఆగస్టు23(ప్రభాత ఉదయం)**

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఉత్తర భారతీయులు అత్తాపూర్‌లోని అంబియన్స్ పోర్ట్ కాలనీ నుంచి భక్తిశ్రద్ధలతో పవిత్ర కావడియాత్రను నిర్వహించారు.ఈ యాత్రలో భక్తులు గంగాజలాన్ని తీసుకువచ్చి రాంబాగ్‌లోని శ్రీ చిన్న అనంతగిరి శివాలయంలో పరమశివునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.వేదమంత్రాలు,శివనామస్మరణల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు.ఈ యాత్రలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మ్యాడం రామేశ్వర్‌రావు,జిల్లా కార్యదర్శి సాబాద విజయ్‌కుమార్,ఎస్‌బి హరినాథ్,అరవింద్ అగర్వాల్,గణేష్ గుప్త,దీపక్,ధర్మేంద్ర అగర్వాల్,ఓం ప్రకాష్,పంకజ్ అగర్వాల్‌తోపాటు అనేకమంది భక్తులు పాల్గొన్నారు.గంగాజలాన్ని భక్తిశ్రద్ధలతో మోసుకొచ్చి పరమశివునికి అభిషేకం చేయడం ద్వారా లోకక్షేమం,సమాజ శాంతి,సౌభాగ్యాల కోసం ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు పాల్గొన్న భక్తులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ శ్రావణమాసంలో శివారాధనకు విశేష ప్రాధాన్యం ఉందన్నారు.ఓం నమఃశివాయ నినాదాలతో కార్యక్రమం భక్తిపారవశ్యంగా కొనసాగింది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608